క్లుప్తంగా

ఆస్తమా అంటువ్యాధి కాదు

కర్నూలు(హాస్పిటల్):ఆస్తమా అంటు వ్యాధి కాదని, వంశపారంపర్యంగా వస్తుందని ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ జి. కుళ్లాయప్ప చెప్పారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన తన క్లినిక్‌లో ఉచిత వైద్యశిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తమా జబ్బుతో ఊపిరితిత్తుల శ్వాసనాళాలు సంకోచం చెంది, గాలి పోవడానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. దీంతో కావాల్సినంత ప్రాణవాయువు ఊపిరితిత్తులకు చేరుకోలేదన్నారు. అప్పుడు రోగికి దగ్గు, రొప్పుట, ఆయాస పడటం, పిల్లి కూతలు, గురగుర శబ్దాలు, ఛాతి బిగుసుకుపోవడం జరుగుతుందన్నారు. స్వల్పలక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు.

పెద్దాసుపత్రికి వైద్యపరికరాల విరాళం



వైద్యపరికరాలను డాక్టర్ వెంకటరంగారెడ్డికి అందజేస్తున్న డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నగరంలోని శ్రీచక్ర హాస్పిటల్ యాజమాన్యం పలు వైద్య పరికరాలు విరాళంగా అందజేసింది. మంగళవారం పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి వైద్యపరికరాలు, ఈసీజీ మిషన్‌ను శ్రీచక్ర హాస్పిటల్ ఎండీ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్త పడాలి

కర్నూలు(హాస్పిటల్): వేసవి ఉష్ణోగ్రతలు, ఉక్కపోత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు వడదెబ్బకు, డీ హైడ్రేషన్‌కు గురిగాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఈఈఓ శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక సుబేదారు వీధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడదెబ్బకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు, చికిత్స, నివారణ చర్యల గురించి ప్రజలకు వివరించారు. వడదెబ్బకు గురైన వారిని త్వరగా నీడగల ప్రదేశానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయాలన్నారు. అనంతరం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించా లని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు అరుణ, జ్యోతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదికగా సమ్మర్ క్యాంప్

కర్నూలు కల్చరల్: సమ్మర్ క్యాంప్ సృజనాత్మకతకు వేదికగా నిలుస్తుందని గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో గత నెల 29న వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. జూన్ 7వ తేదీ వరకు ఈ క్యాంప్ జరుగనుంది. ఈ నేపథ్యంలో పెద్దక్క మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, ఇంగ్లీష్ గ్రామర్, డ్రాయింగ్, గేమ్స్ ఈజీ మెథడ్ మ్యాథ్స్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.5 నుంచి 10సంవత్సరాల వయసు విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొనవచ్చన్నారు.

10 నుంచి ఇస్కాన్‌లో చందన యాత్ర

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఈనెల 10 నుంచి 30వ తేదీ వరకు శ్రీ జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు -2024ను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభాన్ని కలగజేయటం కోసం శ్రీ జగన్నాథ స్వామివారికి వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ)నుంచి 21 రోజుల పాటు ఇస్కాన్‌లో విశేష ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టండి

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, భీమేష్ రెడ్డి కోరారు. మంగళవారం కల్లూరు అర్బన్ 28 29 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల పాలనలో చేసిన మంచిని వివరించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే వార్డులు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

నేనున్నానంటూ..!

- తలసీమియా బాధితులకు అండగా నిలుస్తున్న వైఎస్ జగన్
- నెలకు రూ.10 వేల ప్రత్యేక పెన్షన్ మంజూరు
- ఉమ్మడి జిల్లాలో 135 మంది లబ్ధిదారులు
- చిన్నారులను చిదిమేస్తున్న మహమ్మారి
- మేనరికపు వివాహాలతో అధికం
- నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సిందే!
- నేడు వరల్డ్ తలసీమియా డే

పిల్లలు ఆడుతూ పాడుతూ ఇంటా బయటా తిరగాలి. అలా కాకుండా నిస్సత్తువగా ఓ మూలన కూర్చుంటే. ఎప్పుడూ ఏదో మహమ్మారి సోకినట్లు వేదన పడుతుంటే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఇలాంటి బాధనే తలసీమియా చిన్నారుల తల్లిదండ్రులూ అనుభవిస్తున్నారు. అయితే, ఐదేళ్ల క్రితం వరకు వీరి గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ చిన్నారులకు నెలకు రూ.10వేల ప్రత్యేక పింఛన్ ఇస్తూ వారి తల్లిదండ్రులకు నేనున్నాననే భరోసా ఇస్తున్నాడు. నేడు ప్రపంచ తలసీమియా దినం సందర్భంగా ప్రత్యేక కథనం.



తలసీమియాతో బాధపడే చిన్నారులు

కర్నూలు(హాస్పిటల్):జిల్లాలో ప్రస్తుతం 135 మందికి పైగా చిన్నారులు తలసీమియా వ్యాధితో సతమతమవుతున్నారు. వీరందరూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో చికిత్స తీసుకుంటున్నారు. వారి వయసును బట్టి నెలకు ఒకటి,రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఇందుకోసం వారి తల్లిదండ్రుల ప్రయాణ, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.3 వేలకు పైగా ఖర్చు అవుతోంది. ఈ చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలోనే స్పందించి ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో ప్రతి నెలా ప్రస్తుతం 135 మంది ఈ పెన్షన్ అందుకుంటున్నారు.

తలసీమియా వ్యాధి అంటే...

మానవుని శరీరంలోని ఎముక మూలిగలో హిమోగ్లోబిన్ ఉండే ఎర్రరక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్నే తలసీమియా వ్యాధి అంటారు. ఇది జన్యు సంబంధమైన వ్యాధి. మేనరికపు వివాహాలు చేసుకున్న తల్లిదండ్రుల మూలంగా చాలా వరకు జన్యుపరంగా ఈ వ్యాధి పిల్లల్లో వస్తోంది. తలసీమియా జన్యువాహకులైన తల్లిదండ్రులకు జన్మించే బిడ్డల్లో పాతిక శాతం మంది పుట్టుకతో ఈ వ్యాధికి గురవుతున్నారు. మరో 25 శాతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటే మరో 50 శాతం మంది తలసీమియా మైనర్‌గా మిగిలిపోతున్నారు. అయితే వీరికి పెద్దగా సమస్యలు ఉండవు కానీ వీరు పెళ్లి చేసుకున్న వారి ద్వారా వారికి కలిగే సంతానానికి తలసీమియా వచ్చే అవకాశం ఉంది.

రక్తపిశాచి ఈ వ్యాధి

రక్తంలోని హిమోగ్లోబిన్‌పై నేరుగా తలసీమియా వ్యాధి అధికంగా ప్రభావం చూపుతుంది. మనం పీల్చుకునే ఆక్సిజన్‌ను రక్తం ద్వారా అన్ని శరీరం భాగాలకు అందించే బాధ్యత హిమోగ్లోబిన్‌ది. తలసీమియా రోగుల్లో శరీరానికి అవసరమైనంత మేర హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. తయారైనా ఎక్కువ కాలం ఉండదు. ఫలితంగా హిమోగ్లోబిన్ నిల్వలు దారుణంగా పడిపోతూ ఉంటాయి. అలా పడిపోయిన ప్రతిసారీ కృత్రిమంగా అందించాల్సి ఉంటుంది.

పెళ్లికి ముందు ఈ జాగ్రత్తలు మేలు

మేనరికపు వివాహాలతో, జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే ఈ వ్యాధిని ఆదిలోనే అంతం చేయవచ్చు. అయితే చేయాల్సిందల్లా నిశ్చితార్థానికి ముందు వధూవరులు కంప్లీట్ బ్లడ్ కౌంట్(సీబీసీ), హెచ్‌బీఏ 2లెవెల్ పరీక్షలు చేయించుకోవాలి. ఇద్దరిల్లో ఒకరైనా తలసీమియా వాహకులు కాదని తేలితే నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోవచ్చు. ఇద్దరూ తలసీమియా వాహకులైతే వారికి జన్మించబోయే బిడ్డకు తలసీమియా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రక్తసంబంధీకుల్లో తలసీమియా వ్యాధి లక్షణాలు ఉన్నాయంటే మరింత జాగ్రత్త పడాలి.

తలసీమియా వ్యాధి లక్షణాలు

- అడుగుతీసి అడుగు వేయలేరు. చిన్న చిన్న బరువులూ మోయలేరు.
- అంతులేని నీరసం, నిస్సత్తువ చిన్నారులను కృంగదీస్తాయి.
- ఎముకల్లో పటుత్వం సన్నగిల్లుతుంది.
- జీర్ణశక్తి మందగిస్తుంది. పొట్టలావెక్కుతుంది.
- ఆరోగ్యం సహకరించక బడిలో గైర్హాజరు రోజులు పెరుగుతాయి

ప్రత్యేక పెన్షన్ మాకెంతో ఆసరా



ఆస్పరి మండలం ముత్కూరు గ్రామం మా సొంత ఊరు. ప్రస్తుతం కర్నూలులో నివాసముంటున్నాము. నాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు లాస్యకు పుట్టుకతోనే తలసీమియా వ్యాధి ఉంది. ఈ కారణంగా ప్రతి నెలా ఆమె ఆరోగ్య ఖర్చులకు రూ.5వేల నుంచి రూ.8వేల దాకా వెచ్చించేవాళ్లం. ఈ క్రమంలో మా కష్టాలు తీర్చేందుకే అన్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రతి నెలా రూ.10వేల ప్రత్యేక పెన్షన్ పాపకు ఇస్తుండటంతో మాకెంతో ఊరట లభిస్తోంది. ప్రతి 21రోజులకు ఒకసారి పాపకు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది.

-శ్రీకాంత్, కర్నూలు

పెన్షన్ రాకముందు ఇబ్బందులు



నేను టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమార్తె ఉమాదేవికి పుట్టుకతోనే తలసీమియా ఉండటంతో ప్రతి నెలా వైద్యఖర్చులకే రూ.5వేల నుంచి రూ.8వేల దాకా ఖర్చు పెట్టేవాళ్లం. టైలరింగ్ వృత్తి ద్వారా వచ్చే డబ్బులు దేనికీ సరిపోయేవి కావు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాప ఆరోగ్యం కోసం ఇచ్చే రూ.10వేల పెన్షన్ మాకు ఎంతో ఉపయోగపడుతోంది. పాప ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుంది.

-జి. మద్దిలేటి, గూడూరు

అవగాహనతోనే వ్యాధి నివారణ



తలసీమియా అనేది జనటిక్ వ్యాధి. దేశంలో ప్రతి సంవత్సరం ఈ వ్యాధితో 10వేల నుంచి 15వేల మంది జన్మిస్తున్నారు. ప్రస్తుతం 67 వేల మంది బీటా తలసీమియాతో బాధపడుతున్నారు. ఈ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధిగ్రస్తులు భవిష్యత్‌లో జన్మించకుండా ఉండేందుకు గాను విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించింది. మేనరికపు వివాహాలు చేసుకోదలిస్తే పెళ్లికి ముందే వైద్యపరీక్షలు చేయించుకోవాలి. అలాగే మొదటి సంతానానికి ఉంటే తర్వాత సంతానానికి రాకుండా ఉండేందుకు, ఒకరికి వస్తే మిగతా పిల్లలందరికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తే నివారించవచ్చు.

-డాక్టర్ కె. సింధూరరెడ్డి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, కర్నూలు

వైఎస్ జగన్‌కు అండగా నిలవండి

- కర్నూలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించండి
- బెస్త కులస్తుల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

కర్నూలు (టౌన్) : బెస్త కులస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో బెస్త కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బెస్త కులస్తులకు ఒక్క మంచి పథకమైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ సర్కారు మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రాష్ట్రంలోని సముద్ర తీరం వెంట ఉన్న ప్రాంతాల్లో మత్స్యకార భరోసా పేరుతో రూ.10 వేలు పెన్షన్ ఇస్తున్నారన్నారు. ఈ పెన్షన్ మొత్తం అన్ని ప్రాంతాల్లోని మత్స్యకారులకు అందించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామన్నారు. ఇప్పటికే మత్స్య కార కుటుంబాలకు నవరత్నాల కింద అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాయన్నారు. మరింత మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎస్వీమోహన్ రెడ్డి, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, 9 వ వార్డు కార్పొరేటర్ పుల్లమ్మ, వార్డు ఇన్‌చార్జ్ నవీన్, మద్దిలేటి, బెస్త రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా మోడల్ పోలింగ్ కేంద్రాలు

- ఎంసీసీ సెంటర్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి



ఎంసీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఏర్పాటు చేసిన 40 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీ వాతావరణంతో పాటు ఆయా కేంద్రాల్లో పక్కాగా వసతులు కల్పించాలని ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి కోరారు. మంగళవారం ఆమె స్థానిక జిల్లా పరిషత్‌లో కొనసాగుతున్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) సెంటర్‌ను పరిశీలించి, ఎంసీసీ టీం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రక్రియను నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈఓ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలానికి ఒకటి ప్రకారం మొత్తం 40 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో స్థానిక ఎంపీడీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో ఆయా కేంద్రాలను మోడల్‌గా ఉంచాలన్నారు. ముఖ్యంగా ఫర్నీచర్, తాగునీరు, టాయ్‌లెట్లు, ఓటర్లకు నీడగా ఉండేందుకు షామియానాలు, పురుషులు, స్త్రీలకు ప్రత్యేకంగా క్యూ లైన్లు, అలాగే ఎగ్జిట్, ఎంట్రీ కూడా ప్రత్యేకంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లకు స్వాగతం చెప్పేందుకు రెడ్ కార్పెట్ ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ కేంద్రాల్లో డిస్‌ప్లే బోర్డులు పెద్దగా, ఆకర్షణీయంగా ఉండాలన్నారు. అలాగే ఆయా మోడల్ కేంద్రాల్లో ఓటింగ్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఓటు వేసి వచ్చిన వారితో ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ సిబ్బంది ఓటర్ల పట్ల చాలా గౌరవంగా, జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడ కూడా విసుగు ప్రదర్శించరాదన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోమ్ ఓటింగ్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు



పాణ్యంలో..

కల్లూరు: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలిసారి ఇంటి నుంచే వయో వృద్ధులు, ఇంటికే పరిమితమైన రోగులు ఓటు వేశారు. కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో మొత్తం 100 మంది హోమ్ ఓటర్లు ఉన్నారు. మంగళవారం 71 మంది ఇంటి నుంచి ఓటు వేసినట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. కల్లూరు అర్బన్ నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, షరీఫ్ నగర్, సెక్షన్ కాలనీలో హోమ్ ఓటింగ్‌ను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పాణ్యంలో 29 మంది హోమ్ ఓటర్లు

పాణ్యం: మండలంలో 29 మంది ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. మంగళవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైందన్నారు. 85 ఏళ్ల పైబడిన వారు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి రెండు రోజుల పాటు ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు.



ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఈఓ



గడ్డికి నిప్పు పెట్టడంతో కమ్ముకున్న పొగ

ఆకతాయిలపై ఫిర్యాదు

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే బోర్లు, పైపులైన్ల వద్ద ఉన్న ఎండుగడ్డికి కొందరు ఆకతాయిలు తరచూ నిప్పుపెడుతుండడంపై మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాగునీటి సరఫరా కోసం ఉన్న పైపులైన్లు, బోర్లు, విద్యుత్‌తీగలు కాలిపోయి పంచాయతీకి వేలాది రూపాయల నష్టం వాటిల్లుతుందని, పోలీసులు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమాలు

కర్నూలు(సెంట్రల్) : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. ఆదివారం అల్లూరి 100వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని గోకారి భవన్‌లో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి కార్యక్రమాన్ని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. యువకులు సాంఘిక దురాచారాలను తరిమికొట్టేందుకు పోరాటాలు చేయాలన్నారు.

దళితబాంధవుడు దామోదరం సంజీవయ్య

కర్నూలు(సెంట్రల్): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య దళిత బాంధవుడు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు కొనియాడారు. మంగళవారం సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, కోడుమూరు అభ్యర్థి మురళీకృష్ణ, కర్నూలు అభ్యర్థి షేక్ జిలానీ బాషా, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఓటేసి గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): పాణ్యం ఎమ్మెల్యేగా తనకు ఓటేసి గెలిపించాలని డి.గౌస్‌దేశాయ్ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం 21వ వార్డు పరిధిలోని మిలటరీ క్యాంటీన్, ఎల్ఐజీ, సాయిబాబా దేవాలయాల పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సుత్తికొడవలి గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

- నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ వినియోగం
- కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన మహిళా ఉద్యోగులు

కర్నూలు (టౌన్): రెండవ రోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1, 687 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక ఏ. క్యాంపులోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులు తమ ఓటు వేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ మాట్లాడుతూ మూడు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ పనిచేస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో ఉంటున్న 33 శాలకు చెందిన ఉద్యోగులు తమ ఓ టు హక్కును వినియోగించుకోవచ్చాన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే సౌకర్యం బుధవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఉద్యోగులకు టెంట్లు, తాగునీరు, కుర్చీలు, టాయిలెట్లు తదితర మౌళిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అదనపు రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, పోస్టల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుందాం

కర్నూలు కల్చరల్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ సూచించారు. మంగళవారం ఆర్‌యూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించారు. ఓటు హక్కుపై అవగాహన కలిగించే బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో పవిత్రమైందన్నారు. దాన్ని సక్రమంగా వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబు స్వార్థ ప్రయోజనాలతో పేదలకు ఇబ్బందులు

- సంక్షేమ పథకాలకు మోకాలడ్డు
- ఇప్పుడు ఓట్ల కోసం రాజకీయాలు
- ల్యాండ్ టైటిలింగ్‌కు గతంలో టీడీపీ మద్దతు ఇచ్చింది
- తెలంగాణకు ఒకలా.. ఏపీకి మరోలా ఈసీ నిర్ణయాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయాలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ అన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే చంద్రబాబు కడుపు మంటతో రగిలిపోతున్నారని తెలిపారు. అమల్లో ఉన్న పథకాలు పేదలకు అందకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు విద్యా దీవెన పథకం చివరి విడత నగదు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం నిధులు విడుదల చేసినా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకుండా ఎన్‌డీఏ కూటమి ఎన్నికల సంఘం ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చంద్రబాబు నాయుడికి ఎన్నికల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందని, పథకాల లబ్ధి పేదలకు అందితే ఓట్లు వేయరనే ఇలాంటి కుట్రలు చేస్తున్నారన్నారు. చేయూత, ఆసరా పథకాల లబ్ధి పేద మహిళలకు అందకుండా అడ్డుపడుతున్న టీడీపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్లు రాకుండా వలంటీర్లను దూరం చేశారని.. ఫలితంగా వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చిందన్నారు. రైతు వ్యతిరేకిగా ముద్రపడిన బాబు అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా ఎన్నికల సంఘం ద్వారా అడ్డుపడ్డారన్నారు. ఒకవైపు వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా చేసిన చంద్రబాబుకు వారి ఉసురు తగులుతుందన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈసీ విభిన్న నిర్ణయాలు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అక్కడ రైతు భరోసాకు అనుమతిచ్చిన ఎన్నికల సంఘం, ఏపీలో మాత్రం రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు అనుమతులు ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక ఇలా చేతగాని తనంతో పేదలకు పథకాల లబ్ధిని అడ్డుకోవడం మంచిది కాదన్నారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలపై పునరాలోచన చేయాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని 2019లో తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వమని, ఆ నాడు అసెంబ్లీలో యాక్ట్‌కి టీడీపీ మద్దతు ఇచ్చిందని, పచ్చ మీడియా చర్చలు పెట్టారన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమే తప్పుడు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. ఆయనతో పాటు కార్పొరేటర్ సాంబశివరావు, కిరణ్, సలీం, రేమట సంపత్ కుమార్ ఉన్నారు.

గుర్తుండిపోయేలా నియోజకవర్గ అభివృద్ధి

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: పాణ్యం నియోజకవర్గాన్ని గుర్తుండిపోయేలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని చిన్నటేకూరు, చిన్నకొట్టాల, బస్తిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కాటసానికి ప్రజలు గజమాలలు, పువ్వులు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను పాణ్యం ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందరెడ్డిని నంద్యాల ఎంపీగా గెలిపించాలని కోరారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడానికి టీడీపీ కూటమిగా ఏర్పడిందని ఎద్దేవా చేశారు. 2014లో 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. అమలు చేసే వాటినే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో పెట్టారన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో జరిగిన ప్రజాగళం సభలో టీడీపీ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. ముజఫర్ నగర్‌లోని సర్వే నంబర్ 524లో ఉన్న వక్ఫ్ బోర్డు భూమి తన పేరుపై కాని తన కుటుంబ సభ్యుల పేరుపై కాని ఉన్నట్లు నిరూపిస్తే టీడీపీ నాయకులకే రాసిస్తానన్నారు. బాబు, కరువు కవలలు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి దగ్గరకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెద్ద ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, సోమన్న, చిన్నటేకూరు సర్పంచ్ లక్ష్మన్న, నాయకులు సత్యం రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.